సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 17 । జూన్ । 2025



'మారెళ్లపాడు'కు నిధులేవి?

సీతారామ ప్రధాన కాలువకు అనుబంధంగా నిర్మించతలపెట్టిన మారెళ్లపాడు ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు కాలేదు. 8లో



అర్చక, ఉద్యోగులకు 'సంక్షేమ నిధి'

ఆలయాల్లో పనిచేసే అర్చక, ఉద్యోగులతో పాటు డీడీఎన్ పథకం కింద పనిచేస్తున్న వారికీ ప్రయోజనం కలగనుంది. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 26°

వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్నిచోట్ల ఆకాశం మేఘావృతమై జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



స్వామివారి ఉత్సవమూర్తులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు కల్యాణంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

డైరెక్టర్(పా)గా బాధ్యతల స్వీకరణ



గౌతమ్ పొట్రుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డైరెక్టర్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి డైరెక్టర్(పా)గా నియమితులైన గౌతమ్ పొట్రు సోమవారం కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ, డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వర్లు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం అన్ని శాఖల జనరల్ మేనేజర్లు, అధికారులు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు గౌతమ్ పొట్రును మర్యాదపూర్వకంగా కలిశారు.

రామాలయంలో 27 నుంచి ఆషాఢ మాసోత్సవాలు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో ఈనెల 27 నుంచి జూలై 24 వరకు ఆషాఢ మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎల్.రమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తులకు ప్రతీ రోజు తిరుమంజనం, సంధ్యాహారతి, తిరువీధి సేవ నిర్వహిస్తామని, ప్రత్యేక రోజుల్లో పట్టాభిషేకం, సుదర్శన హోమం జరుగుతాయని వివరించారు. జూలై 10వ తేదీన గురుపూర్ణిమ సందర్భంగా దమ్మక్క సేవా యాత్ర ఉంటుందని తెలిపారు.

నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం

వీసీలో ఎస్ఈ మహేందర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో వినియోగదారులు, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఎస్ఈ జి.మహేందర్ తెలిపారు. ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి 16 సర్కిళ్లలోని విద్యుత్ ఎస్ఈలు, డీఈలతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీసీకి హాజరైన మహేందర్ మాట్లాడుతూ.. శాఖ పరంగా జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు.

ఇంకుడు గుంతల తనిఖీ



బాలాజీనగర్‌లో పరిశీలిస్తున్న కేంద్ర బృందం ప్రతినిధులు

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో నిర్మిస్తున్న ఇంకుడు గుంతలను కేంద్ర బృందం ప్రతినిధులు పృథ్వీరాజ్, రాజు సోమవారం తనిఖీ చేశారు. ఇంకుడు గుంతల నిర్మాణ తీరు, వినియోగించిన సామగ్రి, లోతు వంటి అంశాలను పరిశీలించారు. పలుచోట్ల లోతు తక్కువగా ఉందని, సామగ్రి పద్ధతి ప్రకారం వినియోగించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. వాటిని తక్షణమే సరిచేయాలని, నీరు వేగంగా భూమిలోకి ఇంకేలా నిర్మాణం ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ చిరంజీవి, ఏపీఎం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువు.. కరువేనా?



పొలంలో యూరియా చల్లుతున్న రైతు(ఫైల్)

యూరియా కొరత ప్రచారంతో రైతుల్లో ఆందోళన

- భూ సంరక్షణ పేరుతో సరఫరాలో కోత !
- ముందస్తు కొనుగోళ్లకు పలువురి ఏర్పాట్లు
- కొరత ఉండదంటున్న అధికారులు

బూర్గంపాడు: ఈ ఏడాది యూరియా కొరత ఉంటుందనే ప్రచారం జిల్లా రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. వ్యవసాయ సీజన్ మొదలైనా సరిపడా ఎరువులు సరఫరా కాలేదు. కాగా, జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే పత్తి విత్తనాలు వేసిన రైతులు.. వరినార్లు పోసుకునేందుకూ సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలోనే అవసరమయ్యే యూరియా కొరత ఉంటుందనే ప్రచారం వారిని కలవరపరుస్తోంది. అయితే కొందరు రైతులు ముందస్తుగానే కొనుగోలు చేసేందుకు సమయాత్తం అవుతున్నారు.

4.70 లక్షల ఎకరాల్లో సాగు..

ఈ వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా సుమారు 4.70 లక్షల ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేయనున్నారు. ఇందులో ప్రధానంగా 2.20 లక్షల ఎకరాల్లో పత్తి, 1.95 లక్షల ఎకరాల్లో వరి వేస్తారని అంచనా. మిగితా విస్తీర్ణంలో మిర్చి, ఆయిల్ పామ్, ఇతర అపరాల పంటలు సాగవుతున్నాయి. ఈ పంటల సాగులో రైతులు ఎక్కువగా యూరియానే వినియోగిస్తున్నారు. కాంప్లెక్స్ ఎరువులతో పోల్చితే యూరియా ధర నాలుగింతలు తక్కువగా ఉండడమే దీనికి కారణంగా తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రాయితీ పోగా 40 కిలోల యూరియా బస్తా రూ.267.50 చొప్పున పీఏసీఎస్ గోదాముల్లో లభిస్తోంది. ప్రైవేట్ డీలర్ల వద్ద కొనుగోలు చేస్తే రూ. 320 వరకు ఉంటుంది. మిగతా ఏ కాంప్లెక్స్ ఎరువు కొనాలన్నా బస్తా ధర రూ.1350కి పైగానే ఉంటుంది. దీంతో పేద, మధ్యతరగతి రైతులంతా ఎక్కువగా యూరియాపైనే ఆధారపడుతున్నారు. అయితే యూరియా వినియోగం తగ్గించి భూ సంరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఈ క్రమంలోనే రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు యూరియా సరఫరాలో కోత విధిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

అందుబాటులో 8,200 మెట్రిక్ టన్నులు..

ప్రస్తుతం జిల్లాలో 8,200 మెట్రిక్ టన్నులు యూరియా అందుబాటులో ఉంది. జూలై నెల నుంచి పంటలకు ఎరువులు వినియోగం ప్రారంభమవుతుంది. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో యూరియా వినియోగం మరింతగా పెరుగుతుంది. అప్పుడు అందుబాటులో లేకపోతే ఇబ్బంది పడాల్సి వస్తుందనే భయంతో రైతులు ముందస్తుగానే కొనుగోలు చేస్తున్నారు. గతంలో కూడా యూరియా కొరత ఉన్నప్పుడు రైతులు రోజుల తరబడి క్యూలైన్లలో వేచి ఉండడంతో పాటు ఎరువు దొరకక ఇబ్బంది పడిన ఘటనలూ ఉన్నాయి. ఈ ఏడాది కూడా యూరియా కొరత వస్తుందనే ప్రచారంతో ముందుగానే యూరియా కొనుగోళ్లకు సిద్ధమవుతున్నారు.

యూరియా దొరకదంటున్నారు



ఈ ఏడాది యూరియా దొరకదంటున్నారు. గతంలో కూడా రోజుల తరబడి క్యూలో నిలబడినా రెండు, మూడు బస్తాలే ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితి వస్తుందని అంటున్నారు. సొసైటీ గోదాంలో కొంటేనే బస్తా రూ. 270కి వస్తుంది. బయట షాపుల్లో కొనాలంటే రూ.330 తీసుకుంటున్నారు.

–చెంచలపు రాములు, రైతు, నాగినేనిప్రోలు

సీజన్‌లో దొరకడం లేదు



వ్యవసాయ సీజన్‌లో యూరియా సరిగా దొరకడం లేదు. ప్రైవేట్ దుకాణాల్లో కొంటె ఎక్కువ ధర పెట్టాలి. కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామని అంటగడుతున్నారు. ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచాలి.

–భూక్యా లోక్యా, రైతు, కృష్ణసాగర్

ఆందోళన అవసరం లేదు



యూరియా విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావొద్దు. ప్రస్తుతం జిల్లాలో 8,200 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంది. ప్రతీ నెల వచ్చే యూరియా కోటా వస్తుంది. ఈ ఏడాది నానో యూరియా వినియోగంపై కూడా రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తాం.

–బాబూరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

కార్పొరేషన్ మ్యాప్ రెడీ..!



కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

- రహస్యంగా పూర్తయిన ప్రక్రియ
- అభ్యంతరాలపై నామమాత్రపు పరిశీలన..
- అసహనం వ్యక్తం చేస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు
- అసంతృప్తిలో ఏడు పంచాయతీల ప్రజలు

కొత్తగూడెంఅర్బన్ : కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ల విభజన ప్రక్రియ అభ్యంతరకరంగా ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డివిజన్ల విభజన వివరాలను ఈనెల 5న ప్రకటించిన అధికారులు.. 11వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించి మార్పులు, చేర్పులు చేస్తామని వెల్లడించారు. దీంతో కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలతో పాటు సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీల వారు 51 అభ్యంతరాలను లిఖితపూర్వకంగా అందజేశారు. వాటిని స్వీకరించిన అధికారులు ఎలాంటి సర్దుబాట్లు చేయలేదని, కార్యాలయంలో కూర్చుని హడావిడి చేశారే తప్ప అదే జాబితాను మళ్లీ ప్రకటించే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం 60 డివిజన్లతో కూడిన కార్పొరేషన్ మ్యాప్ సిద్ధం చేశారని, ఒకటి రెండు రోజుల్లో విడుదల చేస్తారని తెలుస్తోంది. ఆ వివరాలను కలెక్టర్‌కు పంపించి, ఆయన ఆమోదంతో డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు అందజేస్తారని, అక్కడ గ్రీన్ సిగ్నల్ లభిస్తే ఈనెల 21వ తేదీ వరకు అదే జాబితాను ప్రకటిస్తారని సమాచారం. అయితే ఇటీవల అభ్యంతరాలు స్వీకరించినా అందులో ఎలాంటి మార్పులు చేయకపోవడంపై మాజీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. విభజన ప్రక్రియను గుట్టుచప్పుడు కాకుండా పూర్తి చేయడం సరికాదని, అందరికీ ఆమోదయోగ్యంగా అధికారులు పని చేయాలని అంటున్నారు.

అభ్యంతరాల్లో కొన్ని ఇలా..

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ల విభజన అసంపూర్తిగా, అశాస్త్రీయంగా ఉందని కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలతో పాటు సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీల నుంచి 51 అభ్యంతరాలు వచ్చాయి. వీటిలో ప్రధానంగా డివిజన్‌కు 1,600 వరకు ఓట్లను పెట్టి ఉంటే బాగుండేదని, కొత్తగూడెంలో పాత వార్డులనే కొనసాగించి కొత్తగా పాల్వంచ, సుజాతనగర్ మండలంలోని ఏడు జీపీలను కలిపి డివిజన్లు చేయాలని కోరారు. కొత్తగూడెంలో వార్డులను కుదించి డివిజన్లు చేయడంతో మాజీ కౌన్సిలర్లకు కొంత ఇబ్బంది కలుగుతుందని అంటున్నారు. దీంతో పాటు ఒకే ఏరియాను రెండు డివిజన్లుగా చీల్చడంతో క్రమపద్ధతి లేకుండా పోయిందని, ఒకరి మేలు కోసం మరొకరికి అన్యాయం చేయడం తగదని అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఇక పాల్వంచ నుంచి అన్నీ కొత్తగూడెం, ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయని, పాల్వంచకు ప్రత్యేక గుర్తింపు లేకుండా అవుతుందని ఆ పట్టణ వాసులు కొందరు అభ్యంతరం తెలిపారు. కార్పొరేషన్‌లో విలీనమైనా.. పాల్వంచకు గుర్తింపు ఉండేలా మార్పులు చేర్పులు చేయాలని కోరారు. సుజాతనగర్ మండలానికి సంబంధించి డివిజన్ల విభజన సరిగా జరగలేదని, ఒక గ్రామాన్ని రెండుగా చీల్చడంతో ప్రజలు ఇబ్బంది పడతారని అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే డివిజన్ల విభజన, కొనసాగుతున్న ప్రక్రియ, అభ్యంతరాలకు సంబంధించిన మార్పులు చేర్పుల వంటి విషయాలను అడిగే ప్రయత్నం చేస్తే కార్పొరేషన్ కమిషనర్ స్పందించడం లేదని, కిందిస్థాయి సిబ్బంది వ్యవహార శైలి కూడా సరిగా లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కార్పొరేషన్ తుది నివేదికపై కమిషనర్‌ను వివరణ కోరేందుకు ఫోన్ ద్వారా ప్రయత్నించగా ఆమె స్పందించలేదు.

పామాయిల్ ఫ్యాక్టరీకి రండి



వీసీలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎమ్మెల్యే పాయం, రైతు బాలు తదితరులు

- సీఎంను కోరిన దమ్మపేట మండల రైతు
- సానుకూలంగా స్పందించిన రేవంత్‌రెడ్డి
- మణుగూరులో 'రైతు నేస్తం' వీసీకి హాజరైన కలెక్టర్, ఎమ్మెల్యే

మణుగూరు టౌన్ : దమ్మపేట మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని సందర్శించాలని మొద్దులగూడెం గ్రామానికి చెందిన రైతు కర్లపూడి బాలు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి.. రైతులంతా బాలును ఆదర్శంగా తీసుకోవాలని, లాభాల బాటలో పయనించాలని పిలుపునిచ్చారు. మణుగూరు మండలంలోని గుట్టమల్లారం రైతు వేదికలో సోమవారం ఏర్పాటుచేసిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ జితేష్ వి పాటిల్, స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతు నేస్తం కార్యక్రమ విశిష్టతను సీఎం రేవంత్‌రెడ్డి విశ్లేషించగా, రైతులందరికీ రైతు భరోసా అందేలా బటన్ నొక్కి అకౌంట్లలోకి నిధులు విడుదల చేశారు. ఈ వీసీకి రైతు బాలు కూడా హాజరై సీఎంతో మాట్లాడారు. పామాయిల్ సాగుతో ప్రతి నెలా లాభాలు వస్తున్నాయని, సాగులో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారం, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తోడ్పాటు వెలకట్టలేనివని అన్నారు. వీసీలో జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు, తహసీల్దార్ నరేశ్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏడీఏ తాతారావు, ఏఓ రాహుల్‌రెడ్డి, ఏఈఓ కొమరం లక్ష్మణరావు, రైతులు ఆవుల సర్వేశ్వరరావు కుర్రి చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకూ అవకాశం

'ఇన్‌స్పైర్' రిజిస్ట్రేషన్ ప్రక్రియ షురూ..

కొత్తగూడెంఅర్బన్: ప్రస్తుత విద్యా సంవత్సరానికిగానూ ఇన్‌స్పైర్ మనాక్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని, ఈ ఏడాది ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరాచారి, జిల్లా సైన్స్ అధికారి ఎస్.చలపతిరాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం వారొక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ఆరంభం నుంచే ఇన్‌స్పైర్ కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయని, ఈనెల 15వ తేదీ నుంచి సెప్టెంబర్ 15 వరకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. ఆ తర్వాత పొడగింపు ఉండదని పేర్కొన్నారు.

నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం

నేర సమీక్షలో ఎస్పీ రోహిత్‌రాజు



ఎస్పీ రోహిత్‌రాజు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అమాయక రైతులను మోసం చేస్తూ నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. అధిక వర్షాలు వచ్చినప్పుడు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. సోమవారం నిర్వహించిన నెలవారీ సమీక్ష సమావేశంలో అయన మాట్లాడారు. ప్రతీ కేసును సక్రమంగా పరిశోధన చేయాలని, తద్వారా నేరస్తులకు శిక్ష పడేలా, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అన్నారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ వాహనాలను సద్వినియోగం చేయాలని, అధికారులు, సిబ్బంది ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు, మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా హాట్‌స్పాట్‌లను గుర్తించి గంజాయి రవాణా చేసే వారితోపాటు సేవించే వారిపైనా కేసులు నమోదు చేయాలని, కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వారి నివాస ప్రాంతాలు, వ్యాపార సముదాయాల్లో ఏర్పాటు చేసుకునేలా చూడాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకోవాలని, రికవరీ చేసిన సొత్తును బాధితులకు అందించాలని ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారు, వేగంగా డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్స్) నరేందర్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు, డీసీఆర్‌బీ డీఎస్పీలు రెహమాన్, సతీష్ కుమార్, చంద్రభాను, రవీందర్‌రెడ్డి, మల్లయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

ముంపు ముప్పు తప్పేనా..

- శాశ్వత చర్యలకు పడని ముందడుగు
- పునరావాస శిబిరాలు, స్లూయిజ్‌లే సమస్యలు..?
- ఆధునిక డ్రైయినేజీ, మాస్టర్‌ప్లాన్ ఏర్పాటు అవసరం
- గోదావరి వరదలపై నేడు కలెక్టర్ సమీక్ష



గతేడాది వానాకాలంలో ఆలయ పరిసరాలను చుట్టుముట్టిన వరద నీరు

భద్రాచలం: భద్రాచలం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఏళ్లుగా పట్టి పీడిస్తున్న గోదావరి వరదల సమస్య నుంచి ప్రజలను కాపాడేందుకు చేపట్టాల్సిన రక్షణ చర్యలపై ముందడుగు పడడం లేదు. జూన్ నుంచి ఆగస్టు వరకు చేపట్టాల్సిన తాత్కాలిక పనులు, వాటిపై సమీక్షలే తప్ప శాశ్వత చర్యలపై ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు ఆలోచించడం లేదు. దీంతో ప్రతి ఏటా ప్రజాధనం దుర్వినియోగంతో పాటు ముంపు వాసులకు ఇక్కట్లూ తప్పడం లేదు.

శాశ్వత శిబిరాలు కావాలి..

ఏజెన్సీలో గోదావరి వరదలు ముంచెత్తితే భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల్లో అధికంగా, చర్ల మండలంలో పాక్షికంగా నష్టం చేకూరుతుంది. అయితే భద్రాచలంలో స్లూయిజ్‌ల లీకేజీతో రామాలయం చుట్టూ, కొన్ని కాలనీల్లోకి నీరు చేరుతుంది. తద్వారా ఆయా కాలనీల వారిని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటుచేసే తాత్కాలిక పునరావాస శిబిరాలకు తరలిస్తారు. దీంతో విద్యార్థులు విలువైన సమయం కోల్పోతుండడం ప్రతి సంవత్సరం మామూలుగా మారింది. శాశ్వత పునరావాస శిబిరాలు నిర్మిస్తే అటు విద్యార్థులకు, ఇటు ముంపు బాధితులకు సమస్య తీరుతుంది. ఇక విస్తా కాంప్లెక్స్, కొత్త అశోక్ నగర్ కాలనీలో స్లూయిజ్‌ల లీకేజీ సమస్య కూడా ప్రతీ సంవత్సరం ఇబ్బందిగానే మారుతోంది. నీటి తొలగింపునకు జనరేటర్లు, భారీ మోటార్లను అద్దెకు తేవడం, వాటి కిరాయితో పాటు డీజిల్ ఖర్చులకు రూ.లక్షల వ్యయం అవుతోంది. స్లూయిజ్‌లు లీక్ కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉన్నా.. అధికారులు ఆ దిశగా ముందడుగు వేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆధునిక డ్రెయినేజీ నిర్మిస్తే..

భద్రాచలంలో చినుకు పడిందంటే పట్టణంలోని నీరంతా రామాలయం, నిత్యాన్నదాన సత్రం పరిసర ప్రాంతాల్లో చేరుతుంది. తద్వారా ఇక్కడి ఇళ్లు, పడమర మెట్లు మునిగి భక్తుల రాకపోకలు నిలిచిపోతున్నాయి. తద్వారా ఈ మూడు నెలల పాటు ఆలయానికి భక్తుల సంఖ్య, ఆదాయం గణనీయంగా తగ్గుతున్నాయి. పట్టణంలో నుంచి వర్షపు, మురుగు నీరు పోయేందుకు ఆధునిక డ్రెయినేజీ సిస్టం ఉంటే ఈ సమస్య ఏర్పడేది కాదు. దీంతోపాటు గోదావరి పెరిగినప్పుడు స్లూయిజ్‌లను మూసేయడంతో భారీగా చేరిన నీరు దుకాణాలు, ఇళ్లను ముంచెత్తుతోంది. భద్రాచలంలో శాశ్వత మాస్టర్‌ప్లాన్‌తో పాటు ఆధునిక డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తే ఈ సమస్యలన్నీ తొలగిపోతాయని పట్టణ వాసులు అంటున్నారు.

నేటి సమీక్షలో చర్చించేనా..?

గోదావరికి వరదలొస్తే చేపట్టాల్సిన ముందస్తు ప్రణాళికపై కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్ని శాఖల జిల్లా అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్షించనున్నారు. ఈ నేపథ్యంలో భద్రాచలంలో ముంపు సమస్యకు పరిష్కారం చూపేలా పటిష్ట ప్రణాళిక రూపొందించాలని పట్టణ వాసులు కోరుతున్నారు. గోదావరి పరిసర ప్రాంతాల్లో ముంపు ప్రభావంపై గతేడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వత చర్యలపై దృష్టి సారించాలని వేడుకుంటున్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



గిరిజనుల సమస్యలు వింటున్న పీఓ రాహుల్

భద్రాచలం : గిరిజనుల సమస్యలను అర్హతల మేరకు సత్వరమే పరిష్కరించాలని ఐటీడీఏ పీఓ బి. రాహుల్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరజన దర్బార్‌కు హాజరైన వారి నుంచి ఆయన వినతులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్ చేయాలని సూచించారు. టేకులపల్లి మండలానికి చెందిన బాలు సోలార్ విద్యుత్ కనెక్షన్‌కు, సుజాతనగర్ మండలం బేతంపూడికి చెందిన సంతోష్ సీఆర్‌టీ ఉద్యోగానికి, ములకలపల్లి మండలానికి చెందిన విజయలక్ష్మి బోరుబావి తవ్వకం అనుమతికి, ఇల్లెందు మండలం ఒడ్డుగూడేనికి చెందిన అశోక్‌కుమార్ ఆర్ఓఎఫ్ఆర్ పట్టా పేరు మార్పుకు, ఆళ్లపల్లి మండలం దుమ్ముగూడెం మండలం లక్ష్మీపూర్‌కు చెందిన వెంకటేశ్వర్లు ఆర్థిక సహాయం కోసం దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఈఈ హరీష్, ఏఓ సున్నం రాంబాబు, ఎస్ఓ భాస్కరన్, ఎఫ్‌డీసీ ఉదయ్‌కుమార్, కొండరెడ్ల అధికారి మణిధర్, అధికారులు లక్ష్మీనారాయణ, ఆదినారాయణ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

బినామీలను నమ్మి మోసపోకండి..

ఐటీడీఏ, తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ఇసుక సొసైటీలను బినామీలకు అప్పగించి మోసపోవద్దని పీఓ రాహుల్ సూచించారు. సోమవారం ఐటీడీఏ సమావేశం మందిరంలో మహిళా సొసైటీల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గిరిజన మహిళల ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి కోసమే సొసైటీలను అప్పగించామని చెప్పారు. పైలట్ ప్రాజెక్టుగా రెండు సొసైటీలను ఎంపిక చేసి, ఒక్కో సొసైటీకి రూ.50 లక్షల చొప్పున ఆర్థిక చేయూత అందిస్తున్నామని తెలిపారు. గోదావరిలో ఇసుక స్టాక్ పాయింట్‌లను కేటాయిస్తున్నామని, నిర్వహణ బాధ్యత పూర్తిగా సొసైటీ మహిళలే చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పెసా ప్రత్యేకాధికారి మణిధర్, ఖనిజాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు మేనేజర్ శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గురుకుల ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధి ఉమ్మడి జిల్లాలోని గిరిజన గురుకులాల్లో ప్రవేశానికి సోమవారం రెండో విడత స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఆర్‌సీఓ అరుణ కుమారి తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశానికి భద్రాచలం గిరిజన గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. బాలురు సీట్ల 352 ఉండగా, 220 మందిని, బాలికల సీట్లు 142 142 మందిని ఎంపిక చేశామని, మిగిలిన బాలురు 132 ఖాళీ సీట్లను త్వరలో భర్తీ చేస్తామని వివరించారు.

ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టిన మరో టిప్పర్

- తీవ్ర గాయాలై డ్రైవర్ అక్కడికక్కడే మృతి

బూర్గంపాడు: ఆగి ఉన్న టిప్పర్‌ను వెనుక నుంచి మరో టిప్పర్ ఢీకొని ఓ డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని సందెళ్ల రామాపురం సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సందెళ్ల రామాపురం సమీపంలో టిప్పర్ డ్రైవర్ సందీప్ (25) తన వాహనాన్ని రహదారి పక్కన నిలిపి ఉంచి దాని ముందు నిలబడ్డాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న మరో టిప్పర్ ఢీకొనడంతో ఆగి ఉన్న టిప్పర్ సందీప్ మీదుగా దూసుకెళ్లింది. దీంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై రాజేష్ ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు అశ్వాపురం మండలం అమెర్ద గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు.

మంచినీళ్లు అనుకుని..

- గడ్డి మందు తాగిన చిన్నారి

టేకులపల్లి: మంచినీళ్లు అనుకుని గడ్డి మందు తాగి ఓ చిన్నారి తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన సోమవారం జరిగింది. మండలంలోని తొమ్మిదోమైలు తండాకు చెందిన తేజావత్ కుమార్ చిన్న కుమారుడు నాలుగేళ్ల చైతన్‌రాజ్ తోటి చిన్నారులతో కలిసి పక్కింటి వద్ద ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో దాహం వేయడంతో అక్కడే బాత్‌రూమ్ సమీపంలో ఉన్న గడ్డిమందు డబ్బా తీసుకుని తాగాడు. అస్వస్థతకు గురి కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

రైలునుంచి జారిపడి వ్యక్తి దుర్మరణం

రఘునాథపల్లి: హైదరాబాద్‌లో పని కుదుర్చుకుని స్వగ్రామానికి వెళ్తున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం జనగామ జిల్లా రఘునాథపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి తెలిపిన వివరాలు... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం రుద్రంపూర్ గ్రామానికి చెందిన పుల్లూరిసుభాష్(46) హైదరాబాద్‌లో పనులు చూసుకునేందుకు వెళ్లాడు. అక్కడ పని కుదుర్చుకుని సోమవారం తెల్లవారుజామున రైలులో తిరిగి వస్తుండగా రఘునాథపల్లి స్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. దీంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందా డు. మృతుడి ఫోన్ ఆధారంగా రైల్వే పోలీసులు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. కాగా, సుభాష్‌కు భార్య రమాదేవి, కూతురు ఉన్నారు.

‘మారెళ్లపాడు’కు నిధులేవి?

- ముందుకు సాగని ఎత్తిపోతల పథకం
- రూ.92.21 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు



అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులోని సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్

అశ్వాపురం: సీతారామ ప్రధాన కాలువకు అనుబంధంగా నిర్మించతలపెట్టిన మారెళ్లపాడు ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. దీంతో రైతులు నిరాశ చెందుతున్నారు. అశ్వాపురం మండలానికి సీతారామ ప్రాజెక్ట్ జలాలు అందించేందుకు ఈ లిఫ్ట్ నిర్మాణం తలపెట్టారు. సీతారామ ప్రాజెక్ట్ ఫేస్–1 నిర్మాణంలో భాగంగా రూ.25 కోట్లతో పంప్‌హౌస్ నిర్మాణానికి గత ప్రభుత్వంలో 29 జనవరి 2023న శంకుస్థాపన చేశారు. పంప్‌హౌస్‌తోపాటు ఎలకలగూడెంలో 2.230 కిలోమీటర్ వద్ద డెలివరి సిస్టం వరకు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. శంకుస్థాపన చేసి రెండేళ్లు గడిచినా కేవలం ఎర్త్ వర్క్ పనులు మాత్రమే జరిగాయి. బీజీ కొత్తూరు పంప్‌హౌస్ సమీపంలో 9.850 కిలోమీటర్ వద్ద మారెళ్లపాడు ఎత్తిపోతల పథక నిర్మాణం చేపట్టారు. ఫేజ్–1లో పంప్‌హౌస్, డెలీవరి సిస్టం వరకు నిర్మించాల్సి ఉంది. డెలీవరి సిస్టం నుంచి 10.950 కిలోమీటర్ల మేర రెండు గ్రావిటీ కెనాల్‌లు నిర్మించనున్నారు. ఎలకలగూడెం నుంచి మణుగూరు వైపు 9.65 కిలోమీటర్లుతో ఒక గ్రావిటీ కెనాల్, 1.30 కిలోమీటర్‌తో తుమ్మలచెరువుకు మరో గ్రావిటీ కెనాల్ నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపారు. గ్రావిటీ కెనాల్, స్ట్రక్చర్స్ నిర్మాణానికి రూ.92.21 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ ప్రభుత్వం ఇప్పటివరకు నిధులు మంజూరు చేయలేదు.

పథకం పూర్తయితే 16,181 ఎకరాలకు సాగునీరు..

మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పూర్తయితే మండలంలో 16,181 ఎకరాలకు సాగునీరు అందుతుంది. మండలంలోని తుమ్మలచెరువు, చింతలచెరువు, చాకలికుంట, రంగప్పకుంట, శనగకుంట, దేవేంద్రునికుంట, అప్పలకుంట, పొగాకుకుంట, ఊర కుంట, ఎర్రబొక్కలచెరువు, మేర రామయ్య కుంటల ద్వారా సాగునీరు అందించనున్నారు. అయితే నిధులు లేకపోవడంతో పనులు సాగడంలేదు. ప్రభుత్వం స్పందించి లిఫ్ట్ నిర్మాణం పూర్తిచేయాలని, సీతారామ జలాలు ఈ ప్రాంత రైతాంగానికి అందించాకే ఇతర ప్రాంతాలకు తరలించాలని ఇక్కడి రైతులు కోరుతున్నారు.

మంత్రులు, సీఎం దృష్టికి తీసుకెళ్లా



మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలో 16,181 ఎకరాలకు సాగునీరు అందుతుంది. పంప్‌హౌస్ పనులు పూర్తయితే తుమ్మలచెరువుకు నీరు తరలించి సుమారు 8 వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. గ్రావిటీ కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రులు, సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లా. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా మండలానికి సాగునీరు అందించేందుకు కృషి చేస్తా.

–పాయం వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే పినపాక

ఓసీ విస్తరణ పనుల అడ్డగింత



యంత్రాన్ని అడ్డుకుంటున్న నిర్వాసితులు

ఇల్లెందురూరల్: సింగరేణి జేకే విస్తరణ కోసం చేపట్టనున్న విస్తరణ పనులను సోమవారం నిర్వాసితులు, 21 పిట్ ఏరియా ప్రజలు, అఖిలపక్ష కమిటీ నాయకులు అడ్డుకున్నారు. నిర్వాసితులు, ప్రభావిత ప్రజల డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. నేల చదును చేసేందుకు వచ్చిన యంత్రాలకు అడ్డుగా నిలవడంతో పనులు ఆగిపోయాయి. రెవెన్యూ అధికారులు తమకు స్థలం అప్పగించారని ఎస్టేట్ అధికారి శివ తెలపగా, దశాబ్దాలుగా గిరిజన రైతులు సాగు చేసుకుంటున్న భూమిని సింగరేణికి ఎలా ధారాదత్తం చేస్తారని అఖిల పక్ష కమిటీ నాయకులు ప్రశ్నించారు. 21పిట్ ఏరియాలో నిర్వాసితులకు ప్యాకేజీ చెల్లింపుపై, ప్రభావిత ప్రాంత ప్రజలకు ఎలా న్యాయం చేస్తారో నేటికీ చెప్పలేదని ప్రశ్నించారు. దీంతో సింగరేణికి అప్పగించిన సాగుభూమిపై ఆర్డీవో వద్ద విచారణ పెండింగ్‌లో ఉన్నందున నిర్ణయం వెలువడే వరకు పనులు నిలిపివేస్తామని రెవెన్యూ ఆర్‌ఐ కామేశ్వరరావు హామీ ఇవ్వడంతో ఇరువర్గాలు వెనుతిరిగాయి. అనంతరం 21పిట్ అఖిల పక్ష కమిటీ ప్రతినిధులు పూనెం సురేందర్, నబీ, శ్రీను, రాజు, నాగరాజు, హరికృష్ణ, మహేష్, రమేష్ తదితరులు మాట్లాడుతూ.. 2013 ఆర్‌అండ్‌ఆర్ చట్టం ప్రకారం నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని, క్వార్టర్లను నివాసం ఉంటున్న వారికే అప్పగించాలని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

కుమారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్చిన ఉపాధ్యాయుడు



పాఠశాలలో కుమారులను చేర్పుతున్న ఉపాధ్యాయుడు

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఉబ్బా శివ తన ఇద్దరు కుమారులను ప్రభుత్వ ఎంపీపీఎస్ అంజిబాక పాఠశాలలో సోమవారం చేర్పించారు. ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం, మంచి బోధన వల్లే తన కుమారులు హర్షవర్ధన్ 4వ తరగతి, ఖుషివర్ధన్ 2వ తరగతిలో చేర్పించానని ఉపాధ్యాయుడు తెలిపాడు. ఈ సందర్భంగా ఉబ్బా శివను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పార్వతి, పర్ణశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఏజే ప్రభాకర్, ఉపాధ్యాయురాలు లక్ష్మీరామం తదితరులు పాల్గొన్నారు.

ఓసీ–4 దుర్గా ఓబీ కంపెనీలో ప్రమాదం

ఇద్దరు కార్మికులకు గాయాలు

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని దుర్గా ఓబీ కంపెనీలో సోమవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఇద్దరు కాంట్రాక్ట్ కార్మికులు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బ్రేక్‌లు ఫెయిలై ఓ డ్రైవర్ క్వారీలో వోల్వోను నిలిపివేశాడు. తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో మెకానిక్‌లు కరణ్‌దేవ్, ఉత్తమ్ కుజూర్‌లు వాహనాన్ని గ్యారేజీకి తీసుకువచ్చేందుకు వెనుక నుంచి లోడర్‌తో నెట్టే క్రమంలో వోల్వోలో బ్రేక్‌లు పనిచేయక లోతు ప్రాంతంలోకి వేగంగా దూసుకెళ్లింది. దీంతో ఎదురుగా ఉన్న మట్టి కుప్పను, కరెంట్ పోల్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో వోల్వో వాహనంలో ఉన్న మెకానిక్‌లకు తీవ్రగాయాలయ్యాయి. యాజమాన్యం, తోటి కార్మికులు క్షతగాత్రులను ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెం తరలించారు. కరణ్‌దేవ్‌ను హైదరాబాద్‌కి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరో కార్మికుడి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. కాగా దుర్గా ప్రైవేట్ ఓబీ కంపెనీ రక్షణ సూత్రాలు పాటించకుండా కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతోందని ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ ఆరోపించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



తేజావత్ కిషన్ (ఫైల్)

టేకులపల్లి: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. టేకులపల్లి ఎస్‌ఐ రాజేందర్ కథనం ప్రకారం.. మండలంలోని దాసుతండా పంచాయతీ రేగులతండాకు చెందిన తేజావత్ కిషన్(52)రాత్రి స్నానం చేసేందుకు వెళ్లి బాత్‌రూమ్‌లో ఉన్న ఇనుప తీగపై టవల్ వేశాడు. స్నానం చేశాక టవల్ తీసుకునే క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. సర్వీస్ వైర్ నుంచి బాత్‌రూమ్‌లోని ఇనుప తీగకు విద్యుత్ సరఫరా కావడంతో ఈ ప్రమాదం జరిగింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో విషయం బయటకు తెలియలేదు. సోమవారం ఉదయం కుమారుడు తండ్రి కోసం వెళ్లి చూసేసరికి బాత్‌రూమ్‌లో విగత జీవిగా పడి ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సందర్శించి సంతాపం తెలిపారు.

మద్యం తాగిన డ్రైవర్‌కు దేహశుద్ధి

మణుగూరు టౌన్: మున్సిపాలిటీలోని రాజుపేట గ్రామస్తులు మద్యం తాగి లారీ నడిపిన ఓ డ్రైవర్‌కు దేహశుద్ధి చేశారు. ఈ సంఘటన సోమవారం జరిగింది. మున్సిపాలిటీలోని ఓ ఇసుక సొసైటీ వద్దకు లోడ్ కోసం రాజుపేట మీదుగా వెళ్తున్న లారీ రాజుపేట గ్రామం ప్రారంభంలో మలుపు వద్ద ఆటోను ఢీ కొట్టబోయింది. ఆటోలో ఇద్దరు చిన్నపిల్లలు, ముగ్గురు మహిళలు ఉండగా, త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. దీంతో ఆగ్రహించిన రాజుపేట గ్రామస్తులు మద్యం తాగి లారీ నడుపుతున్న డ్రైవర్‌కు దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని స్థానికులకు నచ్చజెప్పి పంపించేశారు.

బెదిరింపులకు పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు

దమ్మపేట: తమకు తెలియకుండా ఇసుక తెప్పించుకున్నందుకు నగదు చెల్లించాలని బెదిరింపులకు పాల్పడ్డ ఇద్దరు యూ ట్యూబ్ చానల్ విలేకరులపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని మందలపల్లి గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారురాలు తలుపుల దివ్య నిర్మాణానికి అవసరమైన ఇసుకను ఆదివారం సాయంత్రం లారీలో తెప్పించుకుంది. దీంతో నీలం సాయి, కొలూరి వినోద్ అనే ఇద్దరు యూ ట్యూబ్ చానల్ విలేకరులు ఆ ప్రాంతానికి చేరుకుని ఇంటిని నిర్మిస్తున్న సుగసాని శ్రీధర్‌పై బెదిరింపులకు పాల్పడ్డారు. తమకు తెలియకుండా ఇసుక ఎందుకు తెప్పించారు? మండలంలో ఎవరైనా మా ద్వారానే ఇసుక కొనుగోలు చేయాలి. లేని పక్షంలో కొంత నగదును ఇవ్వాలని బెదిరించారు. బాధితుడు శ్రీధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

క్వింటా బెల్లం స్వాధీనం

కొత్తగూడెంఅర్బన్: ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. టేకులపల్లి మండలానికి చెందిన సుల్తాన్, బాబు, హేమంత్ ద్విచక్ర వాహనంతో పాటు కిరాయి ఆటోలో వంద కేజీల బెల్లం, పది కిలోల పటిక, ఐదు లీటర్ల సారా తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని కొత్తగూడెం స్టేషన్‌కు తరలించారు. ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

గంజాయి సీజ్

బూర్గంపాడు: మండల పరిధిలోని మణుగూరు క్రాస్‌రోడ్‌లో సోమవారం పోలీసులు 330 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన మధుకిరణ్, అల్లూరి కరుణాకర్ ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి తీసుకెళ్తుండగా వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు పట్టుకున్నారు. గంజాయి, బైక్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇద్దరిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఈ ఘటనతో సంబంధం ఉన్న మరో ముగ్గురిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

టేకులపల్లి: మండలంలోని పెట్రాంచెలక గ్రామానికి చెందిన ఈసం మహేష్, చింతలకట్టకు చెందిన వర్స కిషోర్ సోమవారం బైక్‌పై టేకులపల్లి వచ్చి వెళ్తున్నారు. ఈ క్రమంలో దాసుతండా సమీపంలో రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన లారీ ఒక్కసారిగా రోడ్డు మీదకు రావడంతో వెనుక నుంచి లారీని ఢీకొట్టారు. దీంతో ఇద్దరికి గాయాలు కాగా, చికిత్స నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వైద్యారోగ్యశాఖలో కదలిక

సాక్షి ఎఫెక్ట్..



దోమల నివారణ మందు పిచికారీని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ స్పందన

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం పీహెచ్‌సీ పరిధి కొండరెడ్ల గ్రామమైన పాత రెడ్డిగూడెంలో కొద్ది రోజులుగా మలేరియా, విష జ్వరాల విజృంభిస్తున్నాయి. ఇదే విషయమై సోమవారం ‘సాక్షి’ దినపత్రికలో ‘వణికిస్తున్న జ్వరాలు’ శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల్లో కదలిక వచ్చింది. డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్ నాయక్ జ్వరాల విజృంభణపై ఆరా తీశారు. మలేరియా ప్రభావిత గ్రామమైన పాత రెడ్డిగూడెంతోపాటు బండారుగుంపు, మేడారం కాలనీ గ్రామాలను జిల్లా మలేరియా అధికారి డాక్టర్ స్పందన సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న దోమల నివారణ స్ప్రే కార్యక్రమాన్ని తనిఖీ చేసి, ప్రతి ఇంటికీ స్ప్రే చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇళ్ల పరిసరాల్లో యాంటీ లార్వా ఆపరేషన్లు, డ్రైడే కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం వినాయకపురం పీహెచ్‌సీని సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమాల్లో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాందాస్ నాయక్, డీపీఎంఓ మోహన్, సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం బేబి నాంచారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోకలి బండతో దాడి

ఇల్లెందులో వ్యక్తిపై హత్యాయత్నం



ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో క్షతగాత్రుడు శ్యామ్

ఇల్లెందు: పట్టణంలోని జగదాంబా సెంటర్‌లో ఆదివారం అర్ధరాత్రి ఓ వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. ఫిర్యాదుదారు, పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని 13వ నంబర్ బస్తీ 17వ వార్డుకు చెందిన శనిగరపు శ్యామ్ అనే వ్యక్తి రాత్రి 11 గంటల సమయంలో జగదాంబా సెంటర్‌లోని భవాని హోటల్‌కు టిఫిన్ కోసం వెళ్లాడు. హోటల్ మూసే క్రమంలో లోపలి నుంచి టిఫిన్ కట్టిస్తామని చెప్పటంతో హోటల్ లోనికి వెళ్లాడు. పథకం ప్రకారం అప్పటికే అక్కడ ఉన్న నాగరాజు గౌడ్ మరో వ్యక్తితో కలిసి రోకలి బండ, రాడ్‌తో దాడి చేశారు. దీంతో శ్యామ్‌కు తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించారు. శ్యామ్ అన్న కుమారుడు ఆలూరి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బి.సూర్య హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. నాగరాజుకు, శ్యామ్‌కు మధ్య పాత కక్షలతోపాటు వివాహేతర సంబంధం అనుమానంతో ఈ దాడి జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా నిందితుడు నాగరాజుతోపాటు మరో వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాడికి కారణమైన మహిళను, ఆమె తల్లిని కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా రద్దీ ప్రాంతంలో హత్యాయత్నం జరగడం సంచలనంగా మారింది.

గంజాయి కేసులో మరో ముగ్గురు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సైలు

అశ్వారావుపేటరూరల్: గంజాయి కేసులో పరారీలో ఉన్న మరో ముగ్గురు యువకులను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ పింగిళి నాగరాజు రెడ్డి, ఎస్సై యయాతి రాజు కథనం ప్రకారం.. గత నెల 8న అశ్వారావుపేటలోని భద్రాచలం రోడ్‌లో నిర్వహించిన వాహనాల తనిఖీలో పోలీసులు ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, రూ.2.75 లక్షల విలువైన ఐదున్నర కేజీల గంజాయి, మూడ్ బైక్‌లు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. కాగా, అదే కేసులో పరారీలో ఉన్న అశ్వారావుపేటకు చెందిన యువకులు ములగచర్ల వంశీ, పాండ్ల గౌరి ప్రసాద్, కోడెల్లి మదన్‌లను అరెస్టు చేసి దమ్మపేట కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. కాగా, తాజాగా ముగ్గురి అరెస్టుతో ఈ కేసులో నిందితుల సంఖ్య 18 మందికి చేరింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయిను అక్రమంగా రవాణా చేసినా, విక్రయించినా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

అర్చక, ఉద్యోగులకు ‘సంక్షేమ నిధి’

- కేటగిరీల వారీగా ఆర్థిక ప్రయోజనాలు
- సేవల ఆధారంగా లబ్ధి చేకూర్చేలా నిర్ణయం
- జాబితాలో ధూప, దీప పథకం అర్చకులు కూడా..



ఖమ్మంలోని భ్రమరాంబ సమేత గుంటు మల్లేశ్వరస్వామి దేవాలయం

ఖమ్మంగాంధీచౌక్: ఆలయాల్లో పనిచేసే అర్చక, ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించింది. శాశ్వత అర్చక, ఉద్యోగులతో పాటు ధూప, దీప నివేదన(డీడీఎన్) పథకం అమలవుతున్న ఆలయాల అర్చకులకు ప్రయోజనం కలిగేలా చర్యలు చేపట్టింది. ఈమేరకు సంక్షేమ నిధి ద్వారా అర్చక, ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు, సామాజిక భద్రత కల్పించే లక్ష్యంగా విధివిధానాలను ప్రకటించింది. అంతేకాక పదవీ విరమణ పొందిన తర్వాత అందే ప్రయోజనాలను సైతం పెంచడం విశేషం. అయితే, ఈ ప్రయోజనాలు అర్చక, ఉద్యోగుల సేవా కాలం ఆధారంగా అందుతాయి. ప్రభుత్వ నిర్ణయంతో మెడికల్ రీయింబర్స్‌మెంట్, వివాహ పథకం, ఉపనయనం, ఇంటి నిర్మాణం, మరణానంతరం, విద్య తదితర అంశాల్లో లబ్ధి జరగనుంది.

సంక్షేమ ట్రస్టు ద్వారా ప్రయోజనాలు


రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆలయ అర్చక, ఉద్యోగుల ప్రయోజనాల కోసం సంక్షేమ నిధిని ఏర్పాటు చేసింది. ఈ ట్రస్టు ద్వారా పది రకాల పథకాలు అమలుకానున్నాయి.

- అర్చక, ఉద్యోగులకు రిటైర్‌మెంట్ గ్రాట్యూటీ (మరణానంతరం) 20ఏళ్లకు పైగా సేవలందించి వారైతే రూ.8 లక్షలు, 15–20 ఏళ్ల సర్వీస్ కలిగిన వారికి రూ.6 లక్షలు, 10–15 ఏళ్ల సర్వీస్ ఉంటే రూ.4 లక్షలు, పదేళ్ల కనీస సర్వీస్ పూర్తికాక ముందే మృతి చెందితే రూ.2 లక్షలు చెల్లిస్తారు. అలాగే, ధూప, దీప నివేదన పథకం అర్చకులకు మరణానంతరం గ్రాట్యూటీ రూపంలో సర్వీస్ ఆధారంగా రూ.4లక్షలు, రూ.3లక్షలు, రూ.2లక్షలు, రూ.లక్ష అందుతాయి.
- మెడికల్ రీయింబర్స్‌మెంటు గ్రాంట్ కింద మెడికల్ బోర్డు సిఫారసుతో గరిష్టంగా రూ.2 లక్షలు అందిస్తారు.
- వివాహ పథకం కింద రెగ్యులర్ ఉద్యోగులు, కన్సాలిడేటెడ్, ధూప, దీప నివేదన అర్చకులకు రూ.1,01,116 అందిస్తారు. రెగ్యులర్ ఉద్యోగులకైతే రుణంగా రూ. 2 లక్షలు, మహిళా ఉద్యోగితో పాటు ఆమె కుమార్తె, సోదరి వివాహానికి రూ. 1,25,000 అందిస్తారు.
- ఉపనయనం గ్రాంట్ కింద రూ. 50 వేలు అందించనున్నారు.
- మరణానంతరం ఎక్స్‌గ్రేషియాగా రూ.50 వేలు, అంతిమ సంస్కారాల ఖర్చులకు రూ.30 వేలు అందిస్తారు.
- ఇంటి నిర్మాణానికి రూ.50 వేలు, రెగ్యులర్ ఉద్యోగులకైతే రూ.4 లక్షల మేర బ్యాంకు రుణంపై వడ్డీ మొత్తం ఐదేళ్ల వరకు చెల్లిస్తారు.
- విద్య పథకం ద్వారా గ్రాడ్యుయేషన్, పీజీ, పీహెచ్‌డీ కోర్సులకు ఏటా రూ.35 వేలు రీయింబర్స్‌మెంట్ చేస్తారు.
- విధులు నిర్వర్తించలేదని దివ్యాంగులైన ఉద్యోగులకు ఆర్థిక సాయంగా కనీసం 5 – 10 ఏళ్ల సర్వీస్ పూర్తయితే రూ.లక్ష, పదేళ్లకు పైగాసర్వీస్ ఉంటే రూ. 2లక్షలు అందిస్తారు.

ఉమ్మడి జిల్లాలో 702 మంది

రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన సంక్షేమ ట్రస్టు ద్వారా ఉమ్మడి జిల్లాలోని ఆలయాల అర్చక, ఉద్యోగులు, దూప, దీప నివేదన అర్చకులు కలిపి 702 మందికి ప్రయోజనం కలగనుంది. రెండు జిల్లాల్లోని 93 ఆలయాల్లో 100 అర్చకులు, పాచికలు, సహాయ అర్చకులు, పరిచారకులు పనిచేస్తుండగా, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, ఇతర ఉద్యోగులు కలిపి 140 మంది ఉన్నారు. అలాగే, ధూప, దీప నివేదన పథకం ఆలయాల్లో 462 మంది అర్చకులు పనిచేస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



ప్రభుత్వం అర్చకులు, ఉద్యోగుల ప్రయోజనాలకు సంక్షేమ నిధిలో ప్రాధాన్యత ఇచ్చింది. డీడీఎన్ అర్చకులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ప్రకటించడం సంతోషంగా ఉంది. అయితే, ఈ అర్చకులకు నెలనెలా వేతనాలు అందేలా చూడాలి. అంతేకాక మరిన్ని ఆలయాలకు పథకం అమలుచేస్తే అభివృద్ధితో పాటు మరికొందరు అర్చకులకు ఉపాధి లభిస్తుంది.

– మునగలేటి రమేష్‌శర్మ, జిల్లా అధ్యక్షుడు, డీడీఎన్ అర్చకుల సంఘం

యువతి ఆత్మహత్యాయత్నం

సోషల్ మీడియాలో పరిచయమైన యువకుడి వేధింపుల వల్లే..

పాల్వంచరూరల్: ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైన యువకుడి వేధింపులు, బ్లాక్‌మెయిల్‌కు తట్టుకోలేక ఓ యువతి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లిలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని నవభారత్ సమీప వీరస్వామి గుంపునకు చెందిన ఈసం వెంకటేశ్వర్లు కుమార్తె అక్షిత నర్సింగ్ కోర్సు చదువుతోంది. ఆమె కొద్దిరోజులుగా ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లిలోని తన అమ్మమ్మ చుక్కమ్మ ఇంట్లో ఉంటోంది. కాగా ఆమెకు ఇన్‌స్టాగామ్ ద్వారా ఇల్లెందు మండలం రాఘబోయినగూడేనికి చెందిన దారవత్ రాజేష్‌తో పరిచయమైంది. ఆ యువకుడు అక్షిత ఫొటోలు తీసుకుని, మెసేజ్‌లు పెడుతూ మానసికంగా వేధింపులకు గురిచేస్తుండటంతో భరించలేక ఆదివారం రాత్రి గడ్డి మందు తాగింది. కుటుంబ సభ్యులు ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు దారవత్ రాజేష్‌పై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ.సురేశ్ తెలిపారు.

తేనెటీగల దాడిలో ఐదుగురికి గాయాలు

పినపాక: తేనెటీగల దాడిలో సోమవారం తోగ్గూడెం గ్రామానికి చెందిన ఐదుగురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన రత్తమ్మ, సంధ్యారాణి, శైలజ, ధనమ్మ, హరికృష్ణ రాళ్లవాగు పెద్దమ్మ తల్లి ఆలయం వద్దకు భోజ నానికి వెళ్లారు. అనంతరం ఆలయ ఆవరణలో నిద్రిస్తుండగా తేనెటీగలు దాడి చేశాయి. అస్వస్థతకు గురికావడంతో కుటుంబీకులు మణుగూరు ఆస్పత్రికి తీసుకెళ్లారు.